కాలంలాగా సాగే వయసు
గుర్రానికి కళ్ళెం
వేసేదెప్పుడు?

# వయసు గడియారం




పెద్దముల్లు చిన్నముల్లు సరిచేసి, గడియారానికి 'కీ' ఇచ్చి గాఢంగా నిట్టూర్చాడు శశాంక. కాలం ఎంతతొందరగా సాగిపోతోంది? గడియారంవైపు పరిశీలనగా చూశాడు. ఎప్పుడో పెళ్ళినాడు బహుమతిగా వచ్చిన గడియారమది. ఇంకా కొత్తగా మెరుస్తోంది. తనేకాక, తనవస్తువులని నీట్‌గావుంచడం శశాంక ప్రత్యేకత. ఆఫీసులో స్టెనో తరచు —

"శశాంకగారు స్మార్ట్‌గా వున్నారు..." అంటుంది. మొన్నోరోజయితే —

"యూ ఆర్ సింప్లీ సూపర్బ్ సార్..." అంది. ఆమె మాటలకి ఏం జవాబు చెప్పాలో తెలీక, ఇబ్బందిగా నవ్వాడు. సిగ్గుపడ్తున్న తనవైపు సూటిగా చూస్తూ —


"మీ యౌవన రహస్యమేమిటి సార్..." నవ్వుతూ అడిగింది. ఇబ్బందికరమైన ప్రశ్నలకి ఇబ్బంది పెరిగిందే తప్ప, జవాబు ఇవ్వలేక పోయాడు. 'థర్టీ ప్లస్' అని పెదవి చివరిదాకా వచ్చినా అనలేకపోయాడు.

ఈ మధ్యే జరిగిన మరో సంఘటన కూడా కళ్ళముందు కదిలింది. ఆఫీసుకి 'ఫ్లాగ్‌డే' కలెక్షన్ల కోసం దగ్గర్లో వుంటున్న కాలేజీ అమ్మాయిలువచ్చారు. పి.ఏ చందాల కోసం ఆరుగురు అమ్మాయిలు వచ్చారని చెప్పితే, ఇద్దరిని పంపమన్నాడు. ఇద్దరువచ్చారు. జీన్లో వున్న ఓ అమ్మాయి —

"గుడ్‌మార్నింగ్ అంకుల్" అని అనబోయి, శశాంక అందానికి ముగ్ధురాలైనట్టు —

"సారీ సార్..."అంది చిత్రంగా నవ్వుతూ.

"వై సారీ...?" అడిగాడు. జవాబు చెప్పలేనట్టుగా నవ్వేసిందా అమ్మాయి. మరో




అమ్మాయి చేతిలో వున్న 'రిసిప్ట్' బుక్ అందిస్తూ కొంటెగా నవ్వింది. ఇరవై రూపాయలు రాసి బుక్ అందిస్తే —

"థాంక్యూ జంటిల్‌మాన్..." అని నవ్వుతూ బైటికి పరుగుపెట్టారు. ఆ ఇద్దరు అమ్మాయిలు తన వైపు చూసి చిత్రంగా నవ్వడం, జంటిల్ మ్యాన్ అనడం మహదానందాన్ని కలిగించాయి శశాంకకి. మొదటిమ

ంది చాలామంది తనని అభిమానించేవారు 'అందగాడని'. రెండో అత్తయ్య అయితే తన పెళ్లి ముందర ఎంత గొడవ చేసిందని. తన కూతురునే చేసుకోవాలని, చిన్నప్పుడు 'చందురా' వున్న తనని ఎన్నిసార్లు ఎత్తుకు మోశానని. అత్తయ్యలాగే, అత్తకూతురు బాగానేవుంటుంది. కానీ 'మేనరికం' ఇష్టం లేక తనే వద్దన్నాడు. ఆ కోపంతో పెళ్లికి కూడా రాలేదు అత్తయ్య. అందానికే అందంలా వుండే, పుత్తడిబొమ్మలా వున్న రమ్యతో పెళ్లయితే, పెళ్లికి వచ్చిన వాళ్లందరు 'ఈడు జోడు' అని ఎంత దిష్టికొట్టారని, జ్వరంకూడా వచ్చేసింది నిమ్మకాయలు దిష్టితీస్తేకానీ జ్వరం తగ్గలేదు. తనలాగే అందంగా, ఉత్సాహంగా వుండే రమ్య దొరకడం నిజంగా తన అదృష్టం. యౌవన వసంతగీతి కాలాపనలో జీవనం మనోజ్ఞంగా సాగిపోయింది. అనుభవాల జల్లులో అమూల్యమైన అనుభూతుల ఆల్చిప్పల్ని ఏరుకుంటూ సాగిపోయిన జీవితం ఆణిముత్యాల్లాంటి ఇద్దరు పిల్లల్ని అందించింది.

"ఏమండీ నీళ్లు కాగాయి... స్నానానికి రండి..." అన్న రమ్య మాటలకి —

"వస్తున్నా డియర్..." అంటూ కదిలాడు గోడకి గడియారాన్ని తగిలించి.

రమ్య చేతిలో వున్న సున్నిపిండిని చూసేసరికి, తన పుట్టిన రోజన్న సంగతి గుర్తొచ్చింది. నిన్నరాత్రే 'తలంటు' తాలూకు వార్నింగ్ ఇచ్చేసింది రమ్య. నిజానికి తనకైతే ఓ షాంపు పేసా తీసుకుని —

"పట్టులాంటి మృదుత్వానికి..." అంటూ ప్రకటనని వెమురువేసుకుంటూ, సగం తడిపి షాంపూ పోసుకుని తలస్నానం చేయడం ఇష్టం. ఈ తలంటంటే పెద్ద తతంగం. మట్టి వైద్యం చేసుకున్నవాడిలా ఒళ్లంతా నూనె, సున్నిపిండి రాసుకుని, పండగొస్తే వచ్చే పులి వేషగాడిలా ఓ తువ్వాలు ముక్కు చుట్టుకుని తిరగడం, అరగంట పిండీ, తను 'ఎందాకా' సగం కుంకుడు రసాన్ని కళ్లలో, సగం వంటిమీద పోసుకోవడం, అంతా భారీ హడావిడి. కానీ పుట్టినరోజు పూటా కాదనకూడదు కనుక అందులోని "బుజ్జికొండ కదూ" అని రమ్య బుజ్జగిస్తుంది కనుక "కుంకుడు స్నానానికి" గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

తల స్నానం, చిలిపి ప్లస్ కొంటె చేష్టలతో పూర్తయింది. పిసరు కుంకుడు రసం కళ్లలో పడితే ఓ ఉప్పుబెడ్డ నోట్లో వేసుకుని —

తలని శుభ్రంగా తుడుచుకునేసరికి —

పాలగ్లాసుతో రమ్య వచ్చింది. పాలు తాగాక —

"ఈ వేళ నేను చెప్పినట్టు వినాలి బుజ్జికొండ..." అంది మురిపెంగా కళ్లని చేపపిల్లల్లా ఆడిస్తూ.

"చెప్పండి శ్రీమతిగారూ..." వినయంగా అన్నాడు శశాంక.

"ముందు బుద్ధిగా వుంటే, 'పాపిడి' తీసి తల దువ్వుతాను" అంది ముద్దైన అనునయంగా తల దువ్వుతున్నంతసేపు 'కితకింపులు' చేస్తున్న శశాంక దగ్గరికి —

"మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే డాడీ..." అంటూ పిల్లలు వచ్చేసరికి, చిన్నగా [illegible] —

"[illegible]" అంటూ [illegible]

చిలిపిగా చూస్తూ —

"బ్యాడ్ లక్" అంటూ.

"ఇవాళ మీరు కాటుక పెట్టుకోవలసిందే" బుంగమూతి పెట్టింది రమ్య. విశాలమైన కళ్లకి కాటుక అంచు మరీ అందాన్ని ఇచ్చింది.

"ఎంత బ్యూటిఫుల్‌గా వున్నావ్ డాడీ..." అంటూ బుగ్గని కొరికినంత పనిచేసింది కావ్య.

"యూ లుక్ సో యంగ్ డాడీ..." అంటూ మీద పడ్డాడు శరత్. రమ్య ఏదో గుర్తుకు వచ్చినట్టు —

"పాలు పొయ్యిమీద పెట్టి మర్చిపోయామ" హడావిడిగా లోపలికి పరుగెత్తింది.

పిల్లలతో హాయిగా కబుర్లు చెప్పేసరికి, పాయసం గ్లాసులతో వచ్చింది రమ్య. పాయసం తాగడం అయ్యాక మెల్లగా —

"నువ్వు కోపగించుకోకూడదోయ్... అర్జెంట్‌గా హెడ్డాఫీసునుండి ఏదో 'ఇన్‌ఫర్మేషన్' కావాలని 'ఫాక్స్' పంపారు. ఇవాళ లీవ్ పెట్టడం కష్టం. అంచేత... మధ్యాహ్నం భోజనం టైంకి వచ్చేస్తా..." అంటూ హడావిడిగా తెములడం ప్రారంభించాడు. పుట్టింరోజుకూడా భర్త ఆఫీసుకి వెళ్లడం బాధ కలిగించినా —

"మధ్యాహ్నం వచ్చేయాలి... సాయంత్రం ముందు గుడి, ఆ తరువాత సినిమా ప్రోగ్రామ్ వుంది." అంది రమ్య.

"ఓకే... శాంక్స్డ్..." అంటూ పుట్టింరోజుకి కుట్టించుకున్న గచ్చకాయరంగు సఫారీ వేసుకుని కదిలాడు శశాంక.


అసలే ఎప్పుడూ ఫ్రెష్‌గా కనిపించే శశాంక, తలస్నానం చేసే సరికి, కళ్లకు కాటుక దిద్దేసరికి, మరింత 'కళ' వచ్చింది. ఆఫీసులోవాళ్లు నవమన్మధుడ్ని చూసినట్టు చూశారు.

"యూ ఆర్ లుకింగ్ సో సెక్సీ" అంది స్టెనో.

"థాంక్యూ" సిగ్గుపడుతూ అన్నాడు.

"ఎనీథింగ్ స్పెషల్ సార్..." ఆమె

## ఇంకా నిరీక్షణే...



స్వర్గీయ రాజీవ్‌గాంధీ, ఆయన స్నేహితుడు శ్యామ్ పిట్రోడాల కృషిఫలితంగా ప్రస్తుతం మన దేశంలో టెలిఫోన్ రంగంలో మనం ఊహించనంతగా అభివృద్ధి జరిగింది. అయినా ఇప్పటికే దేశంలో 28 లక్షలమంది టెలిఫోన్‌కోసం వేచి వుండడం దురదృష్టమే! అయితే అతిచిన్న రాష్ట్రమైన కేరళలో మూడు లక్షల పాతికవేలమంది ఫోన్‌కోసం నిరీక్షిస్తుంటే అతిపెద్ద రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో 52 వేలమంది మాత్రమే ఫోన్‌కోసం 'వెయిట్' చేస్తున్నారు. అలాగే ఒరిస్సాలో అతి తక్కువగా 6,636మంది మాత్రమే ఫోన్ కావాలంటున్నారట! గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం అవసరమైనవారందరికీ ఫోన్ క్షణాల్లో ఇచ్చేస్తున్నామని అంటున్నా... ఇంకా ఆ రోజు చాలా దూరంగా వున్నట్టుగానే అనిపిస్తోంది.

— జూపిటర్

అడిగింది.

"నథింగ్ స్పెషల్" అని విన్పించి విన్పించనట్టు —

"పుట్టినరోజు" అన్నాడు. ఆమె ఓ మహత్తరమైన విషయాన్ని విన్నట్టు వెర్రి ఆనందం మొహంలో చూపెడ్తూ —

"మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే..." అని చేయి అందించింది.

"పార్టీ..." అని నవ్వి —

"జస్ట్ వన్ మినిట్..." అని క్యాబిన్‌లోంచి బైటికి వచ్చింది. పది నిమిషాల తర్వాత స్వీట్ బాక్స్ తీసుకుని స్టాఫ్ అంతా ప్రత్యక్షమయ్యారు. అందరి అభినందనలు అందుకుని, తమూ స్వీట్స్ పంచాడు. ఉత్సాహంగా హెడ్ ఆఫీసువాళ్లు అడిగిన పని పూర్తిచేశాడు. మధ్యాహ్నం హెడ్డాఫీస్ రిపోర్టు మీద సంతకం చేసి ఇంటికి బయలుదేరాడు. మధ్యాహ్నం లోపు ఏ పనీ లేకపోయినా కావాలని తన క్యాబిన్‌లోకి వచ్చి తనవైపు అదోలా చూసిన ఆడవాళ్లని తల్చుకుని నవ్వుకుంటూ ఇంటికి చేరాడు.

భోజనం పూర్తిచేశాక, సాయంత్రంవరకు 'రెస్ట్' తీసుకుని, సాయంత్రం దగ్గర్లో వున్న గుడికి వెళ్లి దైవదర్శనం చేసుకుని, సినిమాకి వెళ్లారు. సినిమా చూస్తున్నంతసేపు ఏదో తెలియని ఆనందం. తన వయసు పెరుగుతోందా? తరుగుతోందా? ఇందాకా సినిమాహాలు ముందు ఒకప్పటి క్లాస్‌మేట్ వసంత కన్పించింది.

"హల్లో శశీ..." అంటూ పలకరించింది తన భార్య, పిల్లల్ని పరిచయం చేశాడు. కుశల ప్రశ్నలు అయ్యాక తనకే విన్పించేటట్లు మెల్లగా నవ్వుతూ అంది.

"నేను చూడు అప్పుడే 'మామ్మ'లా ఎలా అయిపోయానో... నువ్వుమాత్రం ఎవర్‌గ్రీన్ హీరోలా వున్నావ్..." అంది అభినందిస్తున్నట్టు. ఆమె తన గురించి పెరిగిపోతున్న వయసు గురించి విపరీతంగా బాధపడుతుంటే అందరి ఆడవాళ్లలాగే ఈమే వయసు పెరగకూడదని అనుకుంటోందని నవ్వుకుని — "అలా అంటావేమిటి వసంతా... కాలం కరిగిపోతోంది కదా..."

అంటే —

"అందరూ నీలాగే కాలంతోపాటు 'కరగ'కుండా వుండలేరుకదా. అయినా అంత అదృష్టవంతురాలిని కాదు. నీలాగ వయసు తోపాటు అందం పెరగడానికి" అని నవ్వి, చిత్రంగా కన్నుకొట్టి.

"కాలేజీరోజుల్లోనే నిన్ను గుప్పెట్లో పెట్టుకోవలసింది. అయినా నా ముందు వున్న క్యూ నీ దగ్గరికి రానిస్తేకదా..." అని రమ్యవైపు తిరిగి.

"శశాంక గొప్ప గ్రంథసాంగుడు లెండి. .." అంది. రమ్య వసంత మాటలకి గలగలా నవ్వేసింది. ఇంతలో సినిమా స్టార్టయ్యే బెల్ విన్పించేసరికి అంతా లోపలికి కదిలారు.

సినిమా చూస్తున్నాడన్న మాటేగాని మనసు పరిపరివిధాలుగా పరుగెదుతోంది.

తను గ్రంథసాంగుడట. అప్పట్లో వసంత ఎన్ని వెర్రివేషాలు వేసిందని. నిజానికి గ్రంథసాంగురాలు ఆమె కనుకే ప్రేమించి మరీ పెళ్లిచేసుకుంది.

చప్పట్లు, ఈలలు గట్టిగా విన్పించేసరికి, ఆలోచనలు చెదిరి, తెరవైపు దృష్టి సారించాడు. హీరో హీరోయిన్లు తెరమీద గెంతులు వేస్తున్నారు. వాళ్లు తెరమీద హీరోలు, తను


రియల్ హీరో. ఎంత హీరో కాకపోతే అంతమంది అమ్మాయిలు వెంటబడేవారు. కమ్మని గత స్మృతుల్లోకి జారుకుంటుంటే, ఇంటర్‌వెల్ అయింది.

అనవసరమన్పించినా బైటకి కదిలాడు. వసంత తనకోసమే ఎదురు చూస్తున్నట్టు వుంది. మళ్లీ కబుర్లు. ఆమెకి మరీ ఈర్ష్యగా వున్నట్టుగా వుంది తన అందాన్ని చూసేసరికి. వీలైనన్నిసార్లు 'వయసులో వున్న కుర్రాడిలా' వున్నావని మరీ మరీ అని సినిమా మొదలైన బెల్ విన్పించేసరికి బాధగా (అది బాధ అవునో కాదో అర్థంకాలేదు), ఆరాధనగా శశాంకవైపు చూసి లాలనగా బుగ్గమీద ఓ చిటికె వేసి వెళ్లిపోయింది. వూహించనట్టు ఆమె చేయి బుగ్గని తాకేసరికి, సిగ్గుపడి, ఎవరైనా చూస్తారేమోనన్న కంగారుపడి, హడావిడిగా హాల్లోకి కదిలాడు, వయసులో వున్న మగవాళ్లకన్నా వయసులో వున్నట్టుగా వున్న మగాళ్లంటే ఎక్కువ ఇష్టపడ్తారేమో ఈ ఆడవాళ్లు అమకుంటూ.

సినిమా బొమ్మలు తెరమీద కదులుతున్నాయి. మనసునిండా ఏవో ఆలోచనలు. ఊహలు, ఊహలచాటున ఓ చిత్రమైన కదలిక —

ఈ కాలం ఆగిపోతే ఎంత బాగుంటుంది అన్పించింది ఓ క్షణం. క్షణం క్రితం కదిలిన ఆలోచన గుండెని కుదిపేస్తోంది. అవును. కాలం ఆగిపోవాలి. ఆగిపోతే, ఎప్పుడూ తను అందరికి అందంగా, మన్మధుడిలా కన్పిస్తాడు. అంచేత కాలం సాగకూడదు. ఆగిపోవాలి. వూహ మెదిలిన వెంటనే వెర్రివాడిలా గడియారంవైపు చూశాడు. ఎవరో తరుముకు వస్తున్నట్టు సెకండ్ల ముల్లు వేగంగా వెళ్లిపోతోంది. నిమిషాల ముల్లు భారంగా సాగిపోతోంది.

ముందు గడియారంమీద కోపం వచ్చింది. ఆపైన ఆగని కాలమ్మీద కోపం వచ్చింది. క్షణాల్లో మూడ్ అప్‌సెట్ అయిపోయి పిచ్చిగా గడియారంవైపు చూస్తున్నాడు. ఎప్పుడైతే ఏమాత్రం లెక్కచేయకుండా



కాలం సాగిపోతోందనిపించిందో ఆ క్షణమే చిరాకు మొదలయింది.

సీట్లో అసహనంగా కదిలాడు ముళ్లమీద కూర్చున్నట్టు. సినిమా పూర్తయింది. యాంత్రికంగా బైటకు వచ్చాడు. వసంత కనిపించలేదు. ఎప్పుడూ ఉత్సాహంగా వుండే భర్త అదోలా మారిపోవడం రమ్యకి, పిల్లలకి ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఇంటికి చేరాకా, భోజనం పూర్తిచేసి, బెడ్‌మీదకి చేరాడు. అశాంతిగా అటూ ఇటూ దొర్లాడు. ఎంతకీ నిద్రరాదే? ఎదురుగా పెళ్లినాడు బహుమతిగా వచ్చిన గడియారం. ప్రపంచంలోని ఏ రకమైన మార్పులని ఏ మాత్రం పట్టించుకోనట్టు సెకండ్ల ముల్లు విశ్రాంతగా సాగిపోతోంది. రాగద్వేషాలకి, స్పందనలకి అతీతంగా స్థితప్రజ్ఞుడిలా సెకండ్ల ముల్లు — పెద్దముల్లు, చిన్నముల్లు శిలువలా చేసి తనని దిగ్గొట్టినట్టు అనిపించింది...!

నిద్రరాని నిశిలా... శశాంక వెర్రిగా గడియారం వైపు చూస్తూ ఎప్పటికో నిద్రలోకి జారుకున్నాడు!

○ ● ○

రాత్రి నిద్రపట్టక తలంతా బరువుగా వుంది. కళ్లలో మంటగా వుంది. అతికష్టమ్మీద కళ్లుతెరిచాడు. ఎదురుగా పెళ్లినాటి గడియారం. యాంత్రికంగా టైంవైపు చూశాడు. రెండు చూపెడ్తోంది. అంటే రాత్రి ఆగిపోయిందన్నమాట. కాలం ఆగిపోయిందా?... గడియారం ఆగిపోయింది కానీ —

ఏదో అర్థమైనట్టు గట్టిగా నవ్వడం మొదలుపెట్టాడు. ఆగిపోయిన గడియారం అద్భుతమైన జీవనసత్యాన్ని ఆవిష్కరిస్తోంది. గడియారం ఆగినంతమాత్రాన ఈ కాలం ఆగిపోతుందా?

కాలం లాగానే వయసు —

కాలం గడియారం —

వయసు గడియారం —

ఎన్నో ఏళ్లనుండి జాగ్రత్తగా చూసుకువస్తున్నా గడియారం ఆగిపోయింది. ఇలాగే ఈ జీవితం —

ఎప్పుడో గడియారంలాగే 'గప్‌చిప్'గా ఆగిపోతుంది. ఈ లోపే ఈ అందాలు, ఈ వెర్రివూహలు, పిచ్చి ఆలోచన్లు అన్నీ —

శశాంక ఎందుకంత గట్టిగా నవ్వుతున్నాడో ఇంట్లో ఎవ్వరికీ అర్థంకావడంలేదు!!

○ ● ○

